రక్షణ గోడలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - మండపేట

మండలంలోని ఏడిద, సీతానగరం, తాపేశ్వరం, అర్తమూరు, చిన్నద్వారపూడి తదితర గ్రామాల్లో ఉన్న వంతెనలకు రక్షణ గోడలు నిర్మించాలని ఆ ప్రాంతాల ప్రజలు అధికారులకు విన్నవిం చారు. ఈ గ్రామాల్లో ఉన్న వంతెనలకు రెండువైపులా రక్షణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని స్థాని కులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రామచంద్రపురం రోడ్డులో రక్షణ గోడ లేని వంతెన

నాడు-నేడు పనుల వేగవంతానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో మనబడి నాడు నేడు రెండవ దశ కింద ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, జూన్ 12వ పాఠశాలల పున్ణ ప్రారంభం నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా విద్యాశాఖ సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని ఆయన చాంబర్ నందు స్థానికం గా జిల్లా సాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లతో మనబడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుకల పంపిణీ కోసం సన్నద్ధత, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాల పురోగతి, మిషన్ వాత్సల్య, వైద్యశాఖ సంబంధించి ఎఎన్ఎం ఫీడ్‌బ్యాక్ తదితర అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మనబడి నాడు నేడు ద్వారా మంజూరైన మేజర్ మైనర్ పనులు, రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్లు వంటి పనులు త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పురపాలక సంఘాల పరిధిలో పాఠశాలలకు చెందిన మనబడి నాడు-నేడు పనులు మున్సిపల్ కమిషనర్లు పూర్తిగా పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇంజినీర్లు, పిఆర్ ఇంజినీర్లు ఈ పనుల నిర్వహణలో కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పురపాలక సంఘాలలో ఎన్ని పాఠశాలలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరయింది వివరాలు పై సమీక్షించి నిర్మాణ పనుల అత్యంత నాణ్యత ప్రమా ణాలతో చేపట్టాలని ఆదేశించారు. మనబడి నాడు-నేడు కార్యక్రమాల నిర్వహణకు సెంట్రల్‌గా మెటీరియల్ సేకరించుకోవాలని ఆ బిల్లులు ఆన్‌లైన్‌లో ఎప్పటిక ప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు గాను ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.16 లక్షల కేటాయించడం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జరిగిందన్నారు. వీటిని నిర్మాణాలు వేగవంతం చేసి భవనాలు అందుబాటులో తేవాలన్నారు. స్థల సమస్యలు ఉన్న మూడు చోట్ల ప్రత్యామ్నా యంగా ప్రత్యేక స్థలాలు ఎంపికై రెవెన్యూ శాఖ ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న విద్యా కానుకలు సన్నద్ధతపై సమీక్షిస్తూ స్కూల్ బ్యాగులు, సరఫరా కాబడిన మెటీరియల్ నాణ్యత ప్రమాణాలను పూర్తి గా పర్యవేక్షించి తమకు నివేది క పంపడంతోపాటు పంపిణీకై సిద్ధం చేయాలని అన్నారు.

మనబడి నాడు నేడు మొదటి దశ కార్యక్రమాలకు సంబంధించి పాఠశాలల తరగతి గదులలో ఏర్పాటుచేసిన గ్రీన్ చాక్ బోర్డులను తొలగించి ఆ స్థానంలో 65 అంగుళాల ఎల్ఇడి టివిని డిజిటల్ విద్యా బోధన కొరకు ఏర్పాటు చేయాలన్నారు. తొలగించిన గ్రీన్ చాక్ బోర్డును ప్రాథమిక పాఠ శాలలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల ఆదేశించారు. అదేవిధంగా టీవీకి రెండువైపులా రెండు చిన్న గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమ్మఒడికి కార్యక్రమానికి సంబంధించిన సామాజిక తనిఖీ ఈనెల 29 నాటికి పూర్తి చేసి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. టెన్త్ లో ఉత్తీర్ణత సాధించిన విద్యా ర్థులు అందరూ తప్పనిసరిగా 11వ తరగతి (ఇంటర్, ఐటిఐ పాలిటెక్నిక్) తదితర పై తరగతుల్లో ప్రవేశాలు పొందింది లేనిది పర్యేక్షించి ఏ ఒక్క డ్రాప్ అవుట్ లేకుండా గ్రామ వాలంటీర్ల సహకారంతో చర్యలు బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధనను ప్రతిష్టా త్మకంగా తీసుకున్నదని ఆ దిశగా ఎనిమిది పారామీటర్ల ద్వారా ఆయా లక్షిత వర్గాలకు చెందిన వారిలో రక్తహీనత, తీవ్ర పోషకాహార మరియు పోషకాహార లేమిని శాఖల సమన్వయంతో సరిదిద్దేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టి సత్ఫలితాలు తీసుకొని రావాలన్నారు.

స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా కిశోర్ బాలికలకు సరఫరా కాపాడుతున్న నేప్కిన్లు కూడా వాలంటీర్ల ద్వారా వారి ఇళ్లకు సరఫరా చేయాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనకు సంబంధించి విద్యాశాఖ వైద్య ఆరోగ్యశాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖలు వేరువేరు ఐడీలు జనరేట్ చేస్తున్నారన్నారు. ఇకపై కేవలం ఆధార్ మాత్రమే వాడాలని ఆయన సూచించారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ తదితర పోషకాహార పథకాల ద్వారా ఆశాజనకమైన ఫలితాలను తీసుకొని రావాలన్నారు జగనన్న గోరుముద్ద కింద పాఠశాలల్లో పోషకాహార లేమిని చక్కది ద్దేందుకు రాగి జావా చిక్కి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని వీటిలో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా పాటించాలన్నారు. పురపాలక సంఘ కమిషనర్లు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను తరచుగా సందర్శిస్తూ భోజనం ఏర్పాట్లను స్వయంగా భోజనం చేసి పర్యవేక్షించి లోపాలు ఉన్నట్లయితే గుర్తించి వసతి గృహ నిర్వహణ తీరును మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ వాత్సల్య ద్వారా లక్షిత వర్గాల వారికి మేలుని చేకూర్చాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిధిలోని రాయవరం మండల ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక స్పందన అర్జీలపై సమీక్షించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావు దొర, సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ సుమలత, ఎన్‌సిడి కోఆర్డినేటర్ జాన్ లివి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, అధికారిని జివి.సత్యవాణి, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, ఏడు ప్రాజెక్టుల సిడిపిఒలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డిఇ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతి బసు
- మే 17న మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు అన్నారు. శుక్రవారం అమలాపురం యుటిఎఫ్ హోం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పిల్లలకు పాఠాలు బోధించే కార్యక్రమం కాకుండా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇతర కార్యక్రమాలకె సమయం అంతా వెచ్చించాల్సి వస్తోందని అన్నారు. ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం వారిని పని భారంతో వేధింపులకు గురి చేయడం బాధాకరమనిఅన్నారు. జిల్లాలో అనేకమంది ఉపాధ్యా యులు పని ఒత్తిడి పెరిగి ఆందోళనతో మరణించిన సంగతి తెలిసిందే అని ఆయన సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై వేధింపులు అపకపోతే భవిష్యత్తులో యుటిఎఫ్ తరపున బలమైన ఉద్యమం చేస్తామనిప్రభుత్వాన్ని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి బసు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 17న అమలాపురం సివి.రామన్ పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రయివేటు ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా మెడికల్ క్యాంపులో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె. సురేష్ కుమార్, జిల్లా కార్యదర్శి జివి.రమణ, వై.మురళీమోహన్, దుర్గాప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పని చేయమనడం సరికాదు

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా యుటిఎఫ్ ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన వారు కాబట్టి వేసవి సెలవుల్లో పనిచేయాలని వారిపై వత్తిడి తేవడానికి వీల్లేదని ఉపాధ్యాయులు అన్నారు. వేసవి సెలవుల్లో పనిచేయడం కేవలం స్వచ్ఛందం మాత్రమేనని కోనసీమ ఫ్యాక్టో నాయకత్వం శుక్రవారం జిల్లా డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్‌టియు అధ్యక్షులు శివప్రసాద్, యుటిఎఫ్ నాయకులు కె.సురేష్ కుమార్, బేతినిటి శ్రీనివాస్, వై.మురళి, జివి.రమణ పాల్గొన్నారు.

డిఇఒకువినతి పత్రం అందజేస్తున్న యుటి ఎఫ్ నాయకులు

జిఒ 1 కొట్టి వేతపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి -అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1 ను హైకోర్టు కొట్టు వేయడంపై అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో శు క్రవారం టిడిపినాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిఒ 1 హైకోర్టు కొట్టువేయడం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధానకార్యదర్శి అల్లాడ సోంబాబు, తిక్కిరెడ్డి నేతాజీ, అరిగెల నానాజీ, వేగిరాజు వెంకటరాజు, కడలి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు

మండపేట ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతంగా కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్.1ను హైకోర్టు కొట్టివేయడం ప్రభుత్వానికి చెంపపెట్టని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ అప్రజాస్వామి కంగా, నిరంకుశ వైఖరినితో జారీచేసిన పలు జిఒలను కోర్టులు కొట్టివేస్తున్నా ప్రభుత్వం చలించకపోవడం దారుణమన్నారు.

అమలాపురంలో కేక్ కటింగ్‌చేస్తున్న టిడిపి నాయకులు

పాలతోడులో ఉపాధి పనులు

ప్రజాశక్తి-మండపేట

మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో భాగంగా పాలతోడు గ్రామంలో జగనన్న భూ సర్వే సరిహద్దు రాళ్లను కూలీలు పాతుతున్నారు. తొలుత సర్వేయర్లు ఎక్కడ ఎక్కడ రాళ్లు పాతాలి అనేది గుర్తించి అక్కడ ఆనవాళ్లు ఏర్పాటుచేస్తున్నారు. ఆ ప్రకారం ప్రకారం కూలీలు సుమారు అడుగు లోతు వరకు గొయ్యి తీసి రాళ్లను పాతుతున్నారు. ఉదయం 6 గంటలకే కాలువ పనులు తర్వాత 10 గంటల నుంచి రాళ్లు పాతడం చేస్తున్నామని కూలీలు అంటున్నారు. రాళ్లు చాలా బరువుగా ఉన్నాయని వీటిని మోయడం కష్టంగా ఉంటుందని మహిళా ఉపాధి కూలీలు చెబుతున్నారు. మగ ఉపాధి కూలీలను కూడా ఈ రాళు పాతే పనుల్లో తమకు సహకారం అందిస్తే బరువు మోసేందుకు వాటిని నిలబెట్టే సమయంలోను ఆసరాగా ఉంటారని వారు కోరుతున్నారు.

యశ్వంత్‌ను సన్మానిస్తున్న వూటుకూరితదితరులు

విజ్‌డమ్ స్కూల్ విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఇటీవల విడుదలైన 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో 589 మార్కులు సాధించిన పాత బండారులంక విజ్ డమ్ స్కూల్ విద్యార్థి అంకం యశ్వంత్ కృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు. శు క్రవారం బండారులంక లో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటు కూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మాజీ మండలాధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి అభినందించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు వూటుకూరి సోమరాజు రూ.10,116 నగదు ను ప్రోత్సాహక బహుమతిగా అందించి పెద్దల సమక్షంలో విద్యార్థి యశ్వంత కృష్ణను సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకో వాలని అన్నారు. కార్యక్రమ ంలో యశ్వంత్ తల్లిదండ్రులు అంకం బాల సోమశేఖర్, రమాదేవిలతోపాటు కోనసీమ దేవాంగ సంఘ ప్రతినిధులు జాన శంకరరావు, పిచ్చిక శ్యామ్, బళ్ల వెంకటేశ్వరరావు,వూటుకూరి వీరబ్రహ్మం, చింతపట్ల గంగా సత్యనారాయణ తదితరులు పాల్గొని యశ్వంత్ ను అభినందించారు.

కార్టూ'నిజం'

సంక్షేమానికి, జగన్‌కు మధ్య ఆ పదాన్ని ఎందుకు వాడావయ్యా..? సారు మండి పడుతున్నారు..!!!

చోడవరంలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి-రామచంద్రపురం

చోడవరం గ్రామ సచివాలయం నందు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమం తో పాటు జాతీయ క్షయ వ్యాధి నివారణకార్యక్రమంలో భాగంగా వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 5గురు క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులతో పాటు పోషకాహారాన్ని కెవిఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు కొప్పిశెట్టి వీర వెంకట సత్యనారాయణ 5 కేజీల బియ్యం, 30 కోడిగుడ్లు, ప్రొటీన్ పౌడర్, వేరుశెనగ చిక్కీలు, కందిపప్పు, గోధుమ నూక, రాగి పిండి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వి. ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న 6 నెలల ఉచిత మందులతో పాటు బలవర్ధకమైన పోషకాహారాన్ని తీసుకోవడం వలన రోగి త్వరగా కోలుకుంటాడని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేదూరి సంతోషమ్మ జగ్గీనరావు, ఎంపిటిసి సభ్యురాలు సాదే సుభద్ర అర్జునరావు, హెల్త్ సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, జి.కమల్ శేషు, ఎంఎల్‌హెచ్‌పి సౌభాగ్య శ్రీ, టిబి సూపర్‌వైజర్ లీల, ఎఎన్ఎం శాంతామణి, ఆశాలు పాల్గొన్నారు.

టిబి రోగులకు పోషకాహార కిట్లు అందిస్తున్న దృశ్యం

జన సురక్షా యోజనపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని హసన్ బాద గ్రామంలో భారతీయ స్టేట్ బ్యాంక్ నిర్వహణలో భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశానుసారం గ్రామస్థాయి జన సురక్షా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాల్లో భాగంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో జీవిత బీమా సౌకర్యం గురించి వివరించారు. అదేవిధంగా ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకంలో ప్రమాద బీమా గురించి ఎస్‌బిఐ ద్రాక్షారామ శాఖ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి గ్రామ ప్రజలకు వివరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఈ పథకాల్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హసన్ బాద గ్రామంలో సుమారు రెండు వందల మంది ఈ పథకంలో క్రొత్తగా చేరుటకు దరఖాస్తులు చేసుకున్నారని సర్పంచ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఎస్‌బిఐ ద్రాక్షారామ శాఖ ఫీల్డ్ ఆఫీసర్ కుమారి ఝాన్సీ, ఎస్‌బిఐ కస్టమర్ సర్వీస్ పాయింట్-వలివేటి కుమారి స్వాతి ,గ్రామ ప్రజలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, డ్వాక్రా గ్రూప్ మహిళలుయానిమేటర్ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్

రైతుపోరు బాటకు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - మామిడికుదురు(పి.గన్నవరం)

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం తణుకు నియోజకవర్గంలో నిర్వహించిన పోరుబాటలో పి.గన్నవరం ఎంపిపి అంబటి భూ లక్ష్మి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కారుల్లో బయలుదేరి ర్యాలీగా వెళ్లారు. లంకల గన్నవరంలో కార్లు ర్యాలీ ని ఎంపిపి జండా ఊపి ప్రారంభించారు రైతులకు అండగా నిలిచేందుకు పోరుబాటలో టిడిపి శ్రేణులతో పాల్గొనామని ఎంపిపి తెలిపారు.

చంద్రబాబుతోర్యాలీలో పాల్గొన్న ఎంపిపి భూలక్ష్మి,నాయకులు

ఘనంగా నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండలంలోని టి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోఉన్న సిహెచ్‌సిలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకట పతిరాజు ఆధ్వర్యంలో శు క్రవారం నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం, అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న సీనియర్ నర్సులను దుశ్శాలువాలతో సన్మానించారు. ముఖ్య అతిథి గా జిల్లా ఛైర్మన్ కోరు కొండ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ రోగులు కోలుకొనేవరకు సేవలు అందించే ఉన్నతమైనది నర్సు వృత్తి అని అన్నారు. నర్సులు చేస్తున్న సేవలు మరువలేమని కొనియాడారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి ఎస్.శర్మ,ఎం శేఖర్ పాల్గొన్నారు.

నష్టం వాటిల్లిన పంటల పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం వాటిల్లి న వరి చేల ను డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. ఆయన కె.గంగవరం మండలంలోని పాణింగపల్లి, తామరపల్లి, సత్యవాడ, కె.గంగవరంలో గల పాడైన పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు 35శాతం పైగా దెబ్బతిన్న పంటచేయాలకు నష్టపరిహారం అందజేస్తామని వాటి వివరాలు నమోదు చేయాలని తహశీల్దార్ వైద్యనాథ శర్మకు మండల వ్యవసాయ అధికారి బలుసు రవికి సూచించారు. అదేవిధంగా పొల్లు శాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని ఆర్‌బికెల్లో రైతులు పరిశీలన చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే కె.గంగవరం మండలంలోని భట్లపాలెం, దంగేరు, తామరపల్లి, కె.గంగవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించినట్లు వ్యవసాయ అధికారి రవి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ కు వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా కు అర్హుల జాబితాల ప్రదర్శన

రైతు భరోసా కు ఈ ఏడాది అర్హులైన రైతుల పేర్లను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని మండల వ్యవసాయ అధికారులు బలుసు రవి, ఎన్ సత్యప్రసాద్ తెలియజేశారు. కె. గంగవరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ఇళ్ళసూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం అధికారులతో పాటు క్రింది స్థాయి వరకు గల రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కౌలు రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ పొల్లు పేరుతో మిల్లర్లు రైతులకు నష్టం పరిచే విధంగా వ్యవహరించకుండా గ్రామస్థాయిలోని వ్యవసాయ సహాయకులు రైతులు వెంటుండి వారికి సహకారం అందించాలన్నారు.అవసరమైతే నెలల వద్దకు వెళ్లి మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పంపన నాగమణి, తహశీల్దార్ వైద్యనాథ్ శర్మ, ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు, వెటర్నరీ డాక్టర్ బిందు, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు లో రైతులకు ఏ ఇబ్బందీ లేకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా రామచంద్రపురం మండలం యనమదల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. సత్యప్రసాద్, ఆర్‌బికెల లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు అర్హులు ఎవరైనా ఉంటే ఈనెల 20 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు

పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ తదితరులు

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మామిడికుదురు

పాశర్లపూడి నెల్లి వారి పేటలో ఒఎన్ జిసి నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే కల్వర్ట్ నిర్మాణ పనులకు శుక్రవారం ఎంఎల్ఎ కొండేటి చిట్టి బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమము లో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ లు కొనుకు నాగరాజు, ఎమ్ త్రిమూర్తులు, పి.గన్నవరం సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, యువి వి.సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యుడు నెల్లి దుర్గా ప్రసాద్, నక్కా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ చిట్టిబాబు

జలజీవన్‌తో ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

జలజవీన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ద్వారా గ్రామంలో తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి తెలిపారు. విలసవిల్లిలో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.12.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఇంటింటికీ కుళాయి కార్యక్రమానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. భావితరాలను దష్టిలో ఉంచుకొని తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, బీర నరసింహమూర్తి, శాంతకుమారి, ఉంగరాల నాగేశ్వరరావు, ప్రసన్న, యన్నపు దుర్గ, బుడితి ఐశ్వర్య, వడ్డి శ్రీను, ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కుళాయికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

చెరువులో మృతి చెందిన చేపలు

కలుషిత నీటితో చేపల మృత్యువాత

ప్రజాశక్తి-మండపేట

స్థానిక వైఎస్ఆర్ పార్కులోని బురుగుంట చెరువులో కొన్ని వందల చేపలు మృత్యువాతపడ్డాయి. చనిపోయిన చేపల నుంచి తీవ్ర దుర్వాసన వస్తున్నడంతో వాకర్స్, పార్కు సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. చెరువులోకి మురుగు నీరు పారడంతో నీరు కలుషితమై చేపలు మృతి చెంది వుంటాయని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ చెరువులోకి వేయడంతో తాబేళ్లు ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని చనిపోతున్నాయని వాటి వలన కూడా దుర్గంధం వెదజల్లుతుందని చెబుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను చెరువులో వేయకుండా చూడాలని పర్యావరణ ప్రేమి కులు కోరుతున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి చెరువును శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

15న ఐటిఐలో అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఆలమూరు రోడ్డులోని ఎస్‌విపిఆర్ఎం ఐటిఐ ఫిట్టర్ చదివిన విద్యార్థులకు ఈ నెల 15న అప్రెంటిస్ మేళా నిర్వహిస్తారని ప్రిన్సిపల్ కె.హనుమంతరావు తెలిపారు. ఆలమూరు మండలంలోని పినపళ్లలో కృష్ణ ప్రభాస్ పేపర్ లిమిటెడ్ కంపెనీ ఐటిఐ ఫిట్టర్ పాస్ అయిన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ కల్పిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంట ర్వ్యూలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నా

వివాహానికి ఎన్ఆర్ఐ సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన పేదింటి వధువు గంగుల నాగమణి వివాహానికి జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఆర్ఐ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని కొత్తపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. ఆయన మాట్లాడుతూ నెదర్లాండ్ లో ఉద్యోగరీత్యా స్థిరపడిన చెముడులంక శివారు గాంధీనగరానికి చెందిన ఎన్నారై యర్రంశెట్టి రవికృష్ణ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు అభిమాని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తాళ్ల డేవిడ్, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా బాబి, కట్టా రాజు, సిరిగినీడి పట్టాభి, పడమట గణేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి - పెరవలి, ఆత్రేయపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని కట్టుంగ పాయలో ఇద్దరు భక్తులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాడపల్లి వెంకటేశ్వరస్వామి మొక్కు తీర్చుకునేందుకు కొంత మంది భక్తులు ఊసులుమర్రి పుష్కరఘాట్ నుంచి ఇసుకతిన్నెల మీదుగా నడుచుకుంటూ వెళ్లారు. వారు కట్టుంగ పాయను దాటుతుండగా నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన తుమ్మలపల్లి కొండమ్మ(48), ఉండ్రాజవరం మండలం దమ్మెన్నుకు చెదిన జిన్నూరు కౌసల్య(17) ప్రమాదశాత్తూ మునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న ఇరు మండలాల పోలీసుల సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. తుమ్మలపల్లి కొండమ్మ మృతదేహాన్ని గుర్తించారు. కౌసల్య కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. కౌసల్య గల్లంతు విషయాన్ని తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు గోవిందు, మంగతాయారు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనతో దుమ్మెనులో విషాదం అలముకుంది.

గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యానాం

యానాం గౌతమి గోదావరి నదిలో దూకి శుక్రవారం యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మత్స్యకారులు చూసి వెంటనే రక్షించారు. అనంతరం ఆ యువకుడిని జిజిహెచ్ కు తరలించారు.పోలీసులు వివరాల ప్రకారం ఫ్రాన్స్ తిప్పకు చెందిన సంగాడి ప్రసాద్ గోదావరి లో దూకగా అక్కడే డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ కాజా లక్ష్మీనారాయణ చూసి మత్స్యకారుల సహాయంతో కాపాడి బంధువులకు అప్పజెప్పినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ కు తరలించారు.

చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యానాం

చీమల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం యానాం ఫెర్రీ రోడ్ లో అద్దె ఇంట్లో నివాసముంటున్న దండుప్రోలు శ్రీను, భార్య భర్తల మధ్య గొడవల నేపథ్యంలో చీమల మందు తాగాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు.వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్ కు తరలించినట్లు తెలిపారు.

ముగ్గురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

నాటు సారా కేసుల విషయంలో తాళ్లపూడి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ టి.రాధిక ఎదుట హాజరుపరిచామని కొవ్వూరు సెబ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. మలకపల్లికి చెందిన కె.శ్రీనివాస్, రాగోలపల్లికి చెందిన పి.వీర్రాజు, తిరుగుడు మెట్టకు చెందిన వి.సతీష్‌లపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంక గ్రామంలో డబ్బులు విషయమై దాడి చేసిన ఘటనపై గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. రఘుదేవపురం గ్రామానికి చెందిన పరిమి శోభారాణి నాలుగేళ్ల క్రితం ఆర్.వెంకటపతి నుంచి రూ.3లక్షలను బొబ్బిల్లంకకు చెందిన అత్తిలి శివకుమార్‌కు మధ్యవర్తిగా ఉండిఇప్పించింది. శివకుమార్ ఏడది పాటు వడ్డీ చెల్లించాడు. తర్వాత ఎవరికీ చెప్పకుండా భార్యతో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న శోభారాణి మిర్తిపాడులో ఉన్న అత్తిలి శివకుమార్ కుమార్తె ఇంటికి వెళ్లింది. డబ్బులు విషయం అడగగా శివకుమార్ కుమార్తె, ఆమె భర్త ప్రసాద్‌తో కలిసి శోభారాణిపై దాడికి దిగారు. ఈ దాడిలో ఆమె తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైంది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

అంబాజీపేటలో అగ్ని ప్రమాదం

రెండు పార్శిల్ లారీలు దగ్ధం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట లో పట్టాభి రామయ్య కార్యాలయ ఆవరణలో నిలిచి ఉన్న రెండు లారీలు శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైనాయి. అమలాపురం కొత్తపేట లకు చెందిన అగ్నిమాపక శకటాలు సమయానికి వచ్చి మంటలు అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఒక లారీ పూర్తిగాను, మరొకటి పాక్షికంగానూ దెబ్బతిన్నట్లు అగ్నిమాపక అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు అంటున్నారు. పి.గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎ. చైతన్యకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

యానాం వార్తలు

ఆర్ఎఒ ఛాంబర్ లో నిర్వహిస్తున్న కమిటీ సమావేశం

ఆక్వాకల్చర్ పై జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతంలోని ఫిష్ ఫ్రేమ్ ల ద్వారా ఆక్వా కల్చర్, రొయ్యల పెంపకాన్ని చేపట్టేందుకు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ ఆమోదం పొందే ప్రతిపాదనను అధ్యయనం చేయడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కమిటీ చైర్పర్సన్ గా ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్ మునిస్వామి, సభ్యులుగా మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, జెఇ పి.భాస్కర్, డిటి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్, నెంబర్ కన్వీనర్‌గా ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ డి గొంతియ్య లు ఉన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఎఒ ఛాంబర్ లో కమిటీ సమావేశం జరిగింది. కమిటీ పరిశీలన కోసం పెండింగ్లో ఉన్న ఆక్వాకల్చర్ ఫారాలను ఏర్పాటు చేయటంపై సమావేశంలో చర్చించారు.దీనికి సంబంధించి ఏడు దరఖాస్తులు అందాయన్నారు.

మెమెంటోలు అందజేస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

ఘనంగా నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం యానాం ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమగ్రశిక్ష అభియాన్ సమావేశపు హాలులో సభను నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి పాల్గొని మాట్లాడుతూ నర్సులు సేవలను ఆయన కొనియాడారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి ఆర్ఎఒ మెమెంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిడి. రవిశంకర్, డాక్టర్ దాస్, స్టాఫ్ నర్సులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

డ్రీమ్స్ పై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

ప్రజాశక్తి - యానాం

యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ హైస్కూల్ (డ్రీమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ) పై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని విద్యార్థులు,తల్లిదండ్రులు నమ్మవద్దని ఆ సంస్థ చైర్మన్ శేరు వెంకటరమణ కోరారు.ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దుష్ప్రచారంను తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. కొంత మంది కావాలని చేసే అసత్య ప్రచారాన్ని, పుకార్లను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నమ్మవద్దన్నారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని, అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

నవోదయలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-యానాం

జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయడానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు దానికి మే 31వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాష్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022-23 సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి 22 జూలైలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాలకు స్థానికంగా ఉన్న నవోదయ విద్యాలయంలోగాని www.navodaya.gov.inలో సంప్రదించాలన్నారు.

జూన్ 12 నాటికి నాడు-నేడు పనులు పూర్తి

కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లాలో మన బడి- నాడు నేడు కింద చేపట్టిన రెండో దశ పనులను జూన్ 12 నాటికి పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ కతికా శుక్లా పాఠశాల విద్య, ఐసిడిఎస్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులతో కలిసి మండల విద్య, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి సెలవులతో పాటు నిర్మాణాలకు అనువైన వాతావరణం ఉన్నందున నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మరుగుదొడ్లు, విద్యుదీకరణ, తాగునీరు తదితర పది రకాల పనులను పూర్తిచేయాలని ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో నాడు నేడు రెండో దశ కింద సుమారు 882 అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. పనుల పురోగతిపై మండల స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు ప్రాధాన్య పనులపై దృష్టిసారించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులను శతశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్లను ప్రణాళికా యుతంగా పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అయిదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ సీడింగ్, ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి, ఇంటర్ విద్యార్థులకు రెమెడియల్ తరగతులు తదితర అంశాలపైనా కలెక్టర్ చర్చించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెఎన్‌విఎస్.అన్నపూర్ణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ ఎం.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం. శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవన విధానంపై అవగాహన కల్పించాలి

కాకినాడ పర్యావరణహిత జీవన విధానంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంపై రెవెన్యూ, కాలుష్యం, మునిసిపల్, కార్మిక, ఐసిడిఎస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సు సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)ను ప్రవేశపెట్టారని ఈ మిషన్‌ను విజయవంతంగా అమలుచేసేందుకు వివిధ శాఖలు సమన్వయంతో, ప్రణాళికాయుతంగా కషిచేయాలని సూచిం చారు. పర్యావరణ స్పృహతో కూడిన జీవనశైలిని ప్రజలు అవలంబించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఈ అంశంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకర, సుస్థిర జీవితం కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మన జీవన విధానాన్ని అందుకు తగిన విధంగా మార్చుకోవాలన్నారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహి ంచాలన్నారు. ఇంధనం, జల వనరుల సంరక్షణ, ఈ-వ్యర్థాల ను తగ్గించడం, సుస్థిర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం వంటివాటిపై ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఈ మిషన్‌ను విజయవంతంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. కతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ కె.శ్రీరమణి, సిపిఒ పి.త్రినాథ్, ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎన్.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

15న వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

నిరుద్యోగిలకి ఉద్యోగ కల్పన దిశగా వికాస కార్యాలయంలో ఈ నెల 15న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావ్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వికాస ఆధ్వర్యంలో మెగా జాబామేళా వివిధ కంపెనీల్లో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా వరుణ్ మోటార్స్ కంపెనీలో రిలేషన్ షిప్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ఎవాల్యుటర్స్, టెలికార్, డ్రైవర్స్ జిఎస్టి కన్సల్టెంట్ అకౌంటెంట్, నిట్ (ఐసిఐసిఐ బ్యాంక్ రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రయినీ, హెూండాయ్ మోబీస్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అంతేకాక ఇసుజు మోటార్స్ లో టెక్నిషియన్ అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రయినింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారన్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బి.టెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10,000 నుండి రూ. 25,000 వరకు జీతం, ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు.ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో గల వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7799376333 wwww.vikasajobs.com సంప్రదించలన్నారు. ఈ ఉద్యోగాలకు అభ్యర్థుల నుండి ఎలాంటి రుసము చెల్లించకుండా ఉచితంగా ఉద్యోగాలను అందిస్తున్నామని ఈ ఉద్యోగాలకు ఎటువంటి మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్ వేసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఖాళీ స్థలాలకు ప్రహరి నిర్మించడం లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పరిరక్షించు కోకపోతే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జగన్నాధపురం ప్రాంతంలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఆయా స్థలాలను స్థానికులు డంపింగ్ యార్డులా వినియోగిస్తున్న విషయాన్ని గమనించారు. కొంతమంది యజమానుల వైఖరి వల్ల నగర సుందరీకరణ దెబ్బ దెబ్బతింటోందని, ఆయా స్థలాలు చెత్త చెదారంతో నిండి పందులు,, కుక్కలు, దోమలకు నిలయంగా మారుతున్నాయన్నారు. ప్రజారోగ్యానికి ఇబ్బందికరంగా మారే ఇటువంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఆయా స్థల యజమానులు తక్షణమే స్పందించకపోతే నోటీసులు ఇచ్చి, చట్టప్రకారం చర్యలు కూడా తీసుకుంటామన్నారు. స్పందించని యజమానుల స్థలాల్లో నోటీస్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని ఆయన నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. కాగా విద్యానగర్ ప్రాంతంలోని జంతు హింస నివారణా సంఘ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించారు. పశువుల సంరక్షణ కోసం అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ పథ్వి చరణ్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వర్షాలు పడే లోపుగా పూడిక తీత పనులను వేగవంతం పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహరావు ఆదేశించారు.. శుక్రవారం ఆయన రేచర్లపేట రైల్వే డ్రైన్, రామకష్ణారావుపేట ప్రాంతం లో జరుగుతున్న డిసిల్టేషన్ పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిని ఆయన అక్కడి శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎఇల తో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. యంత్రాల ద్వారా అవకాశం లేని చోట్ల ప్రత్యామ్నాయంగా కార్మికులతో పనులు చేయిస్తున్న విధానంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులకు సూచనలు ఇచ్చారు. వర్షం కారణంగా ఏ ఒక్క ప్రాంతంలోనూ నీరు నిలిచిపోకుండా ఉండాలని లక్ష్యంతో పూడికతీత పనులను మరింత వేగవంతంగా చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగానికి చెందిన అధికారులు సమన్వయంతో పనుల ప్రగతిని పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. హుూవర్ టిప్పర్ వాహనాల ద్వారా చెత్తను విభజించి తరలిస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. ప్రజలతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులు సకాలంలో విధులకు వస్తున్నారో లేదో ఆరా తీశారు. కార్మికులు ప్రతిరోజు ఇంటికి వస్తున్నందున వారికి మాత్రమే చెత్తను అందజేయాలని అదనపు కమిషనర్ నాగ నరసింహారావు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎఇ వై.నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అడపా సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-కాకినాడ

ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు స్ఫూర్తిదాయకం అని కాకినాడ జిజిహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్యారాణి పేర్కొన్నారు. శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ 203 జయంతి సందర్భంగా కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశేష సేవలు అందించిన నరసింహులు అనే నర్సింగ్ స్టాఫ్ కు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్.సంధ్యారాణి మాట్లాడుతూ రోగులు పట్ల సేవా నిరతితో సేవలందించిన నైటింగేల్ కీర్తి నేటికీ సజీవంగా ఉందన్నారు. ఆమె బాటలో నర్సింగ్ వత్తినెంచుకున్న వారు పయనించాలని కోరారు. అనంతరం ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరన్స్ బ్రాంచి మేనేజర్ పి.రాజేష్, ప్రేమకుమార్‌లు సీనియర్, హెడ్ నర్సులకు ప్రశంసా పత్రాలు అందజేసీ ప్రోత్సాహాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ స్టాఫ్ నర్సులు, గ్రేడ్ టూ నర్సింగ్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ, అక్కమ్మ, శ్యామల, కాకి పరమేశ్వరి, యాని గ్రేష్, హేమలత, తదితులున్నారు.

నైటింగేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

వేసవి వినోదం జయప్రదానికి పిలుపు

జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ

కాకినాడలో ఎమ్ఎస్ఎన్ చారిటీస్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కాకినాడ

ఎమ్ఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు వేసవి వినోదాన్ని జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కెఎన్‌విఎస్. అన్నపూర్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్నాధపురం, కాకినాడ నందు గల ఎమ్ఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నందు మే 16వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు విద్యార్థులకు నిర్వవహిస్తున్న వేసవి వినోదం ను జయప్రదం చేయలని కోరారు. ఈ కార్యక్రమం విబివిఆర్ .ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఏ పాఠశాలలో చదువుతున్న వారైన పాల్గొనవచ్చున్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. 4 వ తరగతి నుండి 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన వచ్చున్నారు. ఈ వేసవి వినోదం లో సైన్స్ ప్రయోగాలు, డ్రాయింగ్, గణితం, పప్పెట్రీ, కథలు, వ్యక్తిత్వ వికాసం, సైన్స్ మెజిక్ అనే అంశాల్లో శిక్షణ ఇవ్వబడును. ఇతర వివరాలకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు 9912703697 నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకష్ణ, జాతీయ పప్పెట్రి శిక్షకులు , పిల్లి గోవిందరాజులు, ఉపాధ్యాయులు టి.వెంకటరావు, కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట రూరల్ తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్ పర్సన్లు విమలాదేవి, సునీత పిలుపునిచ్చారు. సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో మే 8వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం నాడు పాఠశాల విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, డ్రాయింగ్ తదితర అంశములపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ విమల దేవి, సునీత పాఠశాల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ లపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పివి.దేవం, గ్రంథాలయ అధికారి పి.మణి కుమారి

పెద్దబ్రహ్మదేవంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్లు

వడదెబ్బ తగుల కుండా జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-మండపేట

సాధారణంగా వేసవిలో ప్రజలు అస్వస్థకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందులో వడదెబ్బ, హీట్‌క్రాంప్స్ ముఖ్యమైనవి. ఇవి ప్రమాదకరమైనవి చెబుతున్నారు ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్. ఈ రెండూ వచ్చినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ఆయన ప్రజాశక్తికి వివరించారు.

వడదెబ్బ తగలడానికి గల కారణాలు

వాతావరణంలో అత్యధిక ఉష్ణోగ్రత కారణంగా శరీరం నీటిశాతాన్ని కోల్పోతుంది. చెమటరూపంలో శరీరం నుంచి అధికంగా నీరు బయటకు పోయినప్పుడు ఇలా డీ హైడ్రేషన్‌కు గురవుతారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిన వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోతాడు. అతని శరీరంలో ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతాయి. నీరు తేమ కోల్పోవడం అతని శరీరంలో కండరాలు బిగుసుకుపోతాయి. అధిక రక్తపోటు, కొన్నిసార్లు బిపి పెరగడం లేదా బిపి పడిపోవడం, కోమాలోకి వెళ్లడం వంటివి ఈ వడదెబ్బ వల్ల సంభవిస్తాయి.

నివారణ మార్గాలు

వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం, సాయంత్రాం వేళల్లో పనివేళలు మార్చుకోవాలి. నూనె, మసాలాలు పదార్థాలకు ఈ వేసవిలో దూరంగా ఉండాలి. ఈ కాలంలో దొరికే అన్ని రకాల పండ్లనూ ఆహారంలో తీసుకోవాలి. పుచ్చకాయ, కొబ్బరినీళ్ళు, దోసకాయ, ఖర్బూజ, సపోట వంటివి ఆహారంగా తీసుకుంటు తేలికపాటి కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో తప్పనిసరిగా ప్రయాణించాల్సిన వారు గొడుగు లేదా తలపాగ తప్పనిసరిగా ధరించాలి. ప్రయాణంలో నీళ్లు, మజ్జిగ, బార్లీ వంటివి తీసుకెళ్లాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తి దారాళంగా గాలి తగిలే చల్లటి ప్రదేశానికి చేర్చాలి. ఒంటిపై ఉన్ని దుస్తులను వదులుచేసి శ్వాస సులువుగా తీసుకునే సౌకర్యం కల్పించారు. అతనిని దగ్గరలో ఉన్న వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

హీట్‌క్రాంప్స్

అధిక ఉష్ణోగ్రతలకు గురైనప్పుడు శరీరంలో కండరాలు బిగుసుకుపోవడం, చేతులు అదరడం వంటివి సంభవిస్తాయి. దీనివల్ల కాళ్లు, చేతులు, వంకరులకు గుర్రె తిమ్మర్లు వస్తాయి.

హోమియో వైద్యం

ఈ వడదెబ్బ, హీట్‌క్రాంప్స్‌లకు గురైన వ్యక్తులకు నేట్రంకార్బ్ 30సి, గ్లోనైన్ 30 అనే హోమియో మందులు ఎంతగానో ఉపయోగపడతాయి.

'బ్యూటీఫుల్' గర్ల్ చిత్రం విడుదల

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ది స్టోరీ ఆఫ్ ఏ బ్యూటీఫుల్ గర్ల్ చిత్రం స్థానిక వెంకటరామ థియేటర్ లో శుక్రవారం విడుదల అయింది. వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల్లో చిత్రబృందం ఆధ్వర్యంలో ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదల చేసిన సంగతి పాఠకులకు విదితమే. కార్యక్రమంలో విద్యార్థి జెఎసి రాష్ట్ర నాయకులు కరాటం ప్రవీణ్, వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కెవిఆర్ ఎన్.నరసింహ రావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, హ్యూమన్ రైట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.రాయుడు శ్రీ రామ చంద్రమూర్తి, ఎమ్‌డికె.శ్రావణ్ దిలీప్, డాక్టర్ కె.హేమావిజిత, ఎమ్.పార్వతి, జెఎసి నాయకులు తదితరులు ఈ చిత్రాన్ని తిలకించారు.

CHANGE OF NAME

I, AITABATTULA ASHOK KUMAR, S/o. AITABATTULA TULASI RAO, resident of D.No. 2-188/3, Kotha Colony, Komaragiripatnam, Allavaram Mandal, Dr. B.R. Ambedkar Konaseema Dist., change my name from **AITABATTULA ASHOK KUMAR** (Old Name) to **AITHABATHULA ASHOK KUMAR** (New Name). Hence forth Iam being called as **AITHABATHULA ASHOK KUMAR** (New Name), S/o. **AITHABATHULA TULASI RAO** for all purpose.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 31/2022 in **O.S. No. 177/2020**

1. శ్రీమతి ఉండవల్లి షన్ముఖ కృష్ణకుమారి లక్ష్మి -పిటీషనర్/ DHR

VS

1. శ్రీ ఉండవల్లి షన్ముక మార్కండేయ చౌదరి -రెస్పాండెంట్/ JDR

పిటీషనర్/ DHR, పై E.P. నంబరు పిటీషన్ రెస్పాండెంట్/ JDR పై డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు E.P. షెడ్యూల్ దాఖలా ఆస్తులను వేలం వేయుటకు దాఖలు చేయటమైనది. రెస్పాండెంట్/ JDR కు పై నెంబరు E.P. గ్రంథములో ఎన్ని పర్యాయములు కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా E.P. నోటీసులు పంపుతున్నప్పటికీ అందలి విషయములు తెలుసుకొని ఏదో కారణం చెప్పి కావాలని నోటీసులు తీసుకొనకుండా బుద్ధిపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్/ JDR పై అమలు జరగవలసిన నోటీసులు పేపర్ ప్రకటనల ద్వారా తెలియచేయుటకు పిటీషనర్/ DHR కు అనుమతి జారి చేసినారు. కనుక రెస్పాండెంట్/ JDR, పై నంబరు E.P. No. 31/2022, O.S. No. 177/2020 లో వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని **ది. 21-06-2023వ సంవత్సరం తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు ఏమైనా వున్న ఎడల తెలియచేయవలెనని, లేని ఎడల రెస్పాండెంట్/ JDR పై పరోక్షముగా తదుపరి చర్యలు శ్రీ కోర్టు వారు జరిపించవలసి ఉండునని ఇందుమూలముగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

(By Order dt. 10-05-2023)
నిమ్మగడ్డ పుల్లారావు, న్యాయవాది
కొవ్వూరు, సెల్: 7997945148

ప్రకటన

మా క్లయింట్ కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట, సుందర్‌నగర్, డో.నెం. 4-42 కాపురస్తులు **కోలా ముసలయ్య గారి భార్య చల్లా రత్నం గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్ తాలూకు ఆస్తి అనగా రమణయ్యపేట పంచాయతీలో చేరిన గైగోలపాడు గ్రామం సర్వే నెంబర్ 237/13ఎ నందు గల 232 చ॥గ॥ స్థలమునకు సంబంధించి కాకినాడ సబ్ రిజిస్ట్రర్ ఆఫీసు నందు రిజిస్ట్రీ కాబడిన **ఒరిజినల్ క్రయ దస్తావేజు నంబర్ 5949/1991** ను తీసుకుని మా క్లయింట్ సదరు ఆస్తిని వారి పిల్లల పేరున మార్చుటకు ది. 08-5-2023వ తేదీన ఉదయం 11.00 గంటలకు మా క్లయింట్ ఇంటి వద్ద నుండి ఆటోలో బయలుదేరి సర్పవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసునకు వస్తుండగా సదరు దస్తావేజు సంచితో పాటు దారిలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. కావున సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు అందజేయగలరు. అట్లు కాకుండా సదరు దస్తావేజుతో ఎవరైనను ఏవిధమైన లావాదేవీలు జరిపినను అవి మా క్లయింట్‌ను బైండ్ చేయవనియు మరియు చెల్లనేరవనియు అని తెలియజేయడమైనది.

నరహరిశెట్టి రవికృష్ణ, అడ్వకేట్
డో.నెం. 35-4-1, దువ్వూరి వారి సందు
దేవాలయం వీధి, కాకినాడ
సెల్: 9010177599

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189